# కొనుగోళ్లలో జాప్యం..
# రైతులకు శాపం

అకాల వర్షాలతో అన్నదాత అతలాకుతలం



హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన ధాన్యం

- రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయని అధికారులు
- వర్షాలకు కుప్ప చేస్తూ, ఆరబోస్తూ రైతుల అవస్థలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న కర్షకులు

హుస్నాబాద్, మే 20: ధాన్యం కొనుగోళ్లలో అధికారులు జాప్యం చేయడం వల్ల రైతులకు శాపంగా మారింది. రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రానికి తెచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడం వల్ల సమయం వృథాకావడంతో పాటు అకాల వర్షాలతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పూర్తిగా ఎండిన వడ్లను కూడా సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో వర్షం పడి తడిసిపోయి మళ్లీ ఎండేందుకు నాలుగైదు రోజులు ఉండాల్సి వస్తోంది. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌తోపాటు హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో పీఏసీఎస్ తరపున 27కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ తరపున 13కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతేడాదికంటే తక్కువ దిగుబడులు వచ్చి కొనుగోలు కేంద్రాలకు తక్కువ ధాన్యం వచ్చినా సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.గతేడాది ఈ సమయానికి దాదాపు అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయి మూసివేశారు. కానీ పలు కేంద్రాల్లో ఇప్పటికీ ఇంకా వడ్లు ఉన్నాయి. ఎండిన వడ్లను వెంటనే కొనుగోలు చేస్తే వర్షం వల్ల ఇబ్బందులు ఉండేవి కావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో కొనుగోళ్లు జరుగక, అకాల వర్షాలు పడి వడ్లను కుప్ప చేస్తూ, ఆరబోస్తూ రైతులు అతలాకుతలం అవుతున్నారు. ఇప్పటికైనా తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### వారం రోజులుగా మార్కెట్‌లో ఉంటున్నం..



రెండెకరాల వరి పంట సాగు చేసిన. ధాన్యం మార్కెట్‌కు తెచ్చి ఎండబెట్టిన. ఒకరోజు ముందు నా వడ్లు కొంటే అకాల వర్షానికి తడిసేవి కావు. కొనకపోవడం వల్ల ఐదు రోజులుగా నాతోపాటు నా కుటుంబ సభ్యులందరూ ఇక్కడే ఉండాల్సి వస్తోంది. మా దురదృష్టమేమో గానీ రోజూ వాన పడటం వల్ల వడ్లు తడిసిపోయి కొన్ని మొలకలెత్తినయ్. మూడు రోజుల నుంచి వడ్లను కుప్ప చేయడం, మళ్లీ ఆరబెట్టడం, ఆరబోసిన కొద్దిసేపటికే వానపడుతుంది. ఇప్పటికీ తడిసిన వడ్లు ఎండుత లేవు. నా వడ్లు ఎన్నడు ఎండాలే నేను ఎన్నడు ఇంటికి పోవాలె. ఇక్కడికి వచ్చిన నాయకులు తడిసిన వడ్లను కూడా కొంటారని చెప్తున్నరు. కానీ అధికారులు మాత్రం మొత్తం ఎండినంకనే కొంటామంటున్నరు. ఈ లోపు వానకు మొత్తం మొలలెత్తేటట్లు ఉన్నయ్. ఏం జేయాల్నో అర్థం అయిత లేదు. సర్కారోళ్లు ఆదుకోవాలని కోరుకుంటున్న.

– ఇరుగదిండ్ల రాజవ్వ, మహిళా రైతు, హుస్నాబాద్

### వడ్లు మొలకలు వచ్చాయి...



కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి 20 రోజులు అవుతుంది. ఇంతవరకు అధికారులు కొనడం లేదు. రోజూ పడుతున్న వానలకు వడ్లు మొత్తం నాని మొలకలు ఎత్తాయి. మళ్లీ వాటిని ఎండబెట్టడానికి కష్టమవుతుంది. కనీసం అధికారులెవరూ ఇన్ని రోజులు అవుతున్నా రావడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నష్టపోతుంటే బాధవేస్తుంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మా రైతులకు మంచిగుండే... కాంగ్రెస్ పాలనలో అన్ని కష్టాలే...

– దండు మల్లయ్య , రైతు, నారాయణరావుపేట


నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I | హైదరాబాద్, మంగళవారం 21 మే 2024 | SIDDIPET




దుబ్బాక మండలం రాజక్కపేటలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

–రాంరెడ్డి, రైతు, పెద్దలింగారెడ్డిపల్లి

# ధాన్యం కొనుగోళ్లపై నిర్లక్ష్యం

## కర్షకులకు తప్పని తిప్పలు..

దుబ్బాక, మే 20: ధాన్యం కొనుగోళ్లపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో రైతన్నలకు తిప్పలు తప్పడం లేదు. మద్దతు ధర కోసం మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రైతులు పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క అకాల వర్షాలు, మరో పక్క అధికారులు నిర్లక్ష్యంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రోజులు తరబడి ఆరబెడుతూ అవస్థలు పడుతున్నారు. మరికొన్ని చోట్ల లారీలు రాకపోవడంతో కొనుగోలు చేపట్టడం లేదు. దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం 106 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. చాలా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులు తక్కువ ధరకే రైసు మిల్లర్లకు, దళారులకు ధాన్యం విక్రయించారు. తూకంలో బస్తాకు 2 కిలోల చొప్పున తీస్తూ రైతులను ఆర్థికంగా ముంచుతున్నారు.



### 20 రోజులుగా ధాన్యం కొనడం లేదు!



20 రోజుల కిందట కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చాం. ఇప్పటికీ మా ధాన్యం కొనడం లేదు. మాకంటే ముందుగా వచ్చిన వాళ్లు చాలామంది ఉన్నారు. మా గ్రామానికి లారీలు పంపకపోవడంతో ధాన్యం కొనడం లేదు. మా రాజక్కపేట గ్రామంలో మూడుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రోజుకు ఒక్క లారీ చొప్పున పంపిస్తున్నారు. రోజూ ధాన్యం ఆరబెడుతూ.. కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నాం. వారం రోజుల కిందట వర్షానికి వడ్లు తడిసిపోయాయి. వడ్లు ఆరబెట్టిన కొనుగోలు చేయడం లేదు.

– ఆస మల్లవ్వ, రాజక్కపేట(దుబ్బాక)

### పట్టించుకునే నాథుడే లేడు!



ఐదు ఎకరాల్లో సుమారు 120 క్వింటాళ్ల ధాన్యం పండింది. 20 రోజుల కిందట దుబ్బాక మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకొచ్చాం. యార్డులో వడ్లు సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో సమస్య నెలకొంది. వారం రోజుల కిందట కురిసిన వానకు ధాన్యం(వడ్లు) పూర్తిగా తడిసిపోగా, కొనుగోలు చేయడం లేదు. రోజూ వడ్లను ఆరబెడుతూ ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు కొనుగోలు చేస్తారో చెప్పడం లేదు. మద్దతు ధర ఏమో కానీ, పండిన పంట(వడ్ల) కుప్ప వద్ద పడికాపులు కాస్తున్నాం. ఇక్కడ మమ్మల్ని పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.

– దుద్దేడ సుగుణ, దుబ్బాక



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట కొనుగోలు కేంద్రంలో వడ్ల రాశులు

# కేంద్రాల్లో మొలకెత్తుతున్న వడ్లు

- 15 నుంచి 20 రోజులుగా కేంద్రాల్లోనే ధాన్యం
- లారీల కొరతతో ఆలస్యంగా కొనుగోళ్లు
- అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- అవస్థలు పడుతున్న అన్నదాతలు

సిద్దిపేట, మే 20: ఆరుగాలం పంటలు పండించిన రైతులు, ఆ పంటలను అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నాడు. బీఆర్ఎస్ పాలనలో ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించిన రైతన్నకు నేడు ధాన్యం అమ్ముకోవడం ఒక టాస్క్‌ల మారింది. ధాన్యం కంటాలుకాకా ఇబ్బంది పడుతున్న రైతులకు వర్షం ఆశనిపాతంలా తయారైంది. రోజూ ధాన్యాన్ని ఆరబెట్టిన రైతన్నకు సాయంత్రం వచ్చే వర్షం తీవ్ర కష్టాలను మిగులుస్తుంది. సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి, పుల్లూరు, నారాయణరావుపేటలో ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లోనే దర్శనమిస్తున్నాయి. 20రోజులైనా ధాన్యాన్ని కొనడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకవైపు లారీలు రాకపోవడం, ఆరబెట్టిన తర్వాత కురుస్తున్న వర్షంతో ధాన్యం మొలకెత్తుతున్నదని వాపోతున్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో బస్తాకు రెండున్నర కిలోల వరకు ధాన్యాన్ని కట్ చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వడ్లు తెచ్చి 45 రోజులు అవుతుంది



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 45 రోజులు అవుతుంది. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేయలేదు. తొమ్మిది ట్రిప్పుల వడ్లు తీసుకొచ్చా.. ఇటీవల పడిన వానలతో వడ్లు తడిసి మొలకెత్తుతున్నయి. పోయినసారి తొందరగా కొనుగోలు చేశారు. ఈసారే ఇబ్బంది అవుతుంది. వానకు వడ్లు నానడంతో వాటిని ఎండ బెట్టడం, కుప్ప చేయడం కష్టంగా మారింది. తొందరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

– పల్లెమీది లక్ష్మి, రైతు, నారాయణరావుపేట

### వర్షానికి మొలకలు వచ్చాయి...

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 16 రోజులవుతుంది. రెండు కుప్పల వడ్లు పోసిన, మంచిగా ఎండినై, కొనుగోలు చేయడం ఆలస్యంకావడంతో మూడు రోజులపాటు కురిసిన వర్షానికి వడ్లన్నీ తడిసి మొలకలు వచ్చినయి. వడ్లు తూకం వేయమని అడిగితే రోజూ రేపుమాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. లారీలు సరిపోయే విధంగా రాకపోవడంతో కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయి.

– రాంరెడ్డి, రైతు, పెద్దలింగారెడ్డిపల్లి

# రైతుల బతుకులు ఆగం

- ధాన్యం తూకం వేయడంలో జాప్యం
- నర్సాపూర్ పరిధిలోని మండలాల్లో రైతులను నట్టేట ముంచిన వర్షాలు
- కొన్నిచోట్ల వరదకు కొట్టుకుపోయిన వడ్లు
- ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలంటున్న అన్నదాతలు



చిలిపిచెడ్ మండలం అజ్జమర్రిలో చెరువును తలపిస్తున్న కొనుగోలు కేంద్రం

నర్సాపూర్, మే 20: సకాలంలో ధాన్యం తూకం వేయక, తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించక పోవడంతో రైతుల బతుకులు ఆగమైతున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలు కావడంతో రైతన్నలు కన్నీటి సంద్రంలో మునిగిపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో హమాలీల కొరత ఉందని ధాన్యాన్ని తూకం వేయడంలో జాప్యం చేశారు. ఆ తర్వాత తేమ శాతం పేరుతో రైతన్నలను ఇబ్బందులకు గురిచేశారు. తూకం వేశాక, లారీల కొరతంటూ రోజుల తరబడి ధాన్యాన్ని గోదాములకు తరలించక కేంద్రాల్లోనే ఉంచారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధాన్యం తడిసి రైతన్నలను నట్టేట ముంచాయి. కొన్నిచోట్లైతే ఏకంగా ధాన్యం వరదలో కొట్టుకుపోయి రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. నర్సాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడవడమే కాకుండా ఏకంగా వరదలో కొట్టుకుపోయింది. పెద్దచింతకుంట గ్రామంలో తూకం వేసిన సుమారు 300 బస్తాల ధాన్యం సంచులు తడిసిపోయాయి. తడిసిన ధాన్యం బస్తాలను రైస్‌మిల్లులకు తరలించాలని రైతులు కోరగా తిరిగి కొత్త బస్తాల్లోకి మార్చాలని కేంద్రం సిబ్బంది ఆదేశించడంతో రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఓవైపు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని చెపుతుండగా క్షేత్రస్థాయిలో ఆచరణ కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్ల, ఏదుల్లాపూర్ కేంద్రాల్లో కూడా పరిస్థితి దారుణంగా ఉంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15 రోజులు అవుతున్నా తూకం వేయకుండా సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం ఆదివారం కురిసిన వర్షానికి తడిసి రైతుల కంటనీటిని తెప్పించాయి. చిలిపిచెడ్ మండలం అజ్జమర్రి కొనుగోలు కేంద్రంలో లారీల కొరత తీవ్రంగా ఉంది. అరకొరగా లారీలు వచ్చినా రైతుల నుంచి సంచికి రూ.5 చొప్పున వసూలు చేస్తూ రైతన్నలను నట్టేటముంచుతున్నారు. కౌడిపల్లి, కొల్చారం మండలాల్లో కూడా రైతన్నలకు కష్టాలు తప్పడం లేదు. కొల్చారం మండలంలోని రైస్‌మిల్ వద్ద లారీలు పెద్దసంఖ్యలో క్యూ కట్టాయి. ఐదు రోజులవుతున్నా లారీ అన్‌లోడ్ చేయడం లేదంటూ లారీ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి ధాన్యాన్ని తూకం వేయాలని రైతులు గోడు వెల్లబోసుకుంటున్నారు.

### లారీలో ధాన్యం తరలించే వరకు రైతులదే బాధ్యతంటున్నారు



ధాన్యం తూకం వేసినప్పటికీ లారీలో ఎక్కించే వరకు రైతులదే బాధ్యతని కొనుగోలు కేంద్రం సిబ్బంది కొర్రీలు పెడుతున్నారు. లారీలు రాక, తూకం వేసిన ధాన్యం తరలించక కేంద్రాల్లోనే నిరీక్షించాల్సి వస్తుంది. ధాన్యాన్ని తూకం వేసి, బస్తాల్లో నింపి వారం రోజులవుతున్నా లారీలు లేవనే కారణంతో ధాన్యాన్ని తరలిస్తలేరు. ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యపు బస్తాలు తడిసిపోయాయి. తడిసిన బస్తాలను మేము తీసుకోం, వాటిని తిర్లమర్ల వేయండి, కొత్త బస్తాల్లో వడ్లు జమాంచుండ్రి అని సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారు. ప్రభుత్వమే తడిసిన వడ్లను కొంటమని అంటుంటే, ఇక్కడ మాత్రం సిబ్బంది ఆచరించడం లేదు. టాపర్లకు కిరాయిలు కట్టుకుంటూ 12 రోజుల నుంచి కేంద్రంలోనే ఉన్నాం, ఇంకా వడ్లు తీసుకుపోతలేరు. అధికారులు సందర్శించి తడిసిన బస్తాలను పక్కకు పెట్టి తడవని బస్తాలనైనా తీసుకెళ్లి రైతులను ఆదుకోవాలి.

– నాగేశ్‌గౌడ్, చిన్నచింతకుంట, నర్సాపూర్

### తాతకు సాయంగా...



వర్షానికి తడిసిన వడ్లను ఆరబెట్టడంతో తాతకు మనుమరాళ్లు సాయపడుతున్నారు. కుప్పగా ఉన్న వడ్లను తాత నెర్పుతుండగా సాయంగా వడ్లను నెర్పే పనిలో మనుమరాళ్లు నిమగ్నమయ్యారు. గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లి సమీపంలో రింగ్ రోడ్డుపై సోమవారం కనిపించింది ఈ దృశ్యం.

– గజ్వేల్, మే 20

### కూలీలతో కోత కోయిస్తున్న..



యాదగిరికి చెందిన పొలంలో నేలకొరిగిన వరి

గజ్వేల్, మే 20: ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు యాదగిరి ఎకరం విస్తీర్ణంతో వరి సాగుచేశాడు. పదిరోజుల క్రితం మిషన్ సాయంతో కోత కోశాడు. మొదటిరోజు వరి కోసినప్పటి నుంచి భారీగా వర్షాలు కురుస్తుండడంతో పూర్తిస్థాయిలో వరి కోయలేకపోయాడు. గరువిచ్చినరోజు మిషన్ సాయంతో కోద్దామంటే మిషన్ పొలంలో దిగబడుతుంది. పొలం మొత్తం ఎండాలంటే వడ్లేమో వర్షానికి దెబ్బతింటాయనే భయంతో సోమవారం నలుగురు బీహార్ కూలీలతో కోత కోయిస్తున్నాడు. ఆరబెట్టిన వడ్లు ఎండకు ఆరుతుండగా సాయంత్రం సమయంలో కురిసే వర్షాలకు మళ్లీ తడవడంతో దెబ్బతింటున్నాయని వర్షాలతో ఈసారి వడ్ల ఆరబెట్టేందుకే ఎక్కువ రోజులవుతుందన్నాడు. రోడ్లపై చాలామంది రైతులు నేటికీ వడ్లను ఆరబెడుతున్నారు. ఇంకా కోతకోయని పొలాలున్నాయి. ఇలాగే వర్షాలు కురిస్తే వడ్లను అమ్ముకోవడం కష్టం. ఎండిన వడ్లను అధికారులు త్వరగా కొనుగోలు చేపట్టాలి. అప్పుడైనా రైతులకు మంచి జరుగుతుంది.

### కోత కోసినప్పటి నుంచి వర్షమే..



గజ్వేల్, మే 20: మండలంలోని ముట్రాజ్‌పల్లికి చెందిన రైతు బయ్యారం పోచయ్య తనకున్న అర ఎకరాలో సన్నరకం వరి సాగు చేశాడు. పది రోజుల క్రితం వరికోశాడు. అదే రోజు వడ్లను ఆరబెట్టేందుకు రింగ్‌రోడ్డుపై ట్రాక్టర్ సాయంతో తీసుకొచ్చి కుప్పపోశాడు. ఇక మరుసటి నుంచి ప్రతిరోజూ వర్షం కురుస్తుండడంతో వడ్లను ఆరబెట్టడం గగనంగా మారింది. వర్షాలతో వడ్లు తడిసి మొలకలు రాగా ఆందోళనకు గురవుతున్నాడు. వాన గరువిస్తే వడ్లను అమ్ముకునే వీలు కలుగుందన్నాడు. ఆయనతో పాటు చాలామంది రైతులది ఇదే పరిస్థితి. ప్రభుత్వం వెంటనే వడ్లను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# ధాన్యం.. దైన్యం



రాయపోల్ మండలం కొత్తపల్లి ఐకేపీ కేంద్రంలో వర్షాలకు మొలకెత్తిన వడ్లను చూపుతున్న రైతులు

- మొలకెత్తుతున్న ధాన్యం..
- ఐకేపీ కేంద్రాల్లో నత్తనడకన కొనుగోళ్లు
- తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని అన్నదాతల డిమాండ్



రాయపోల్, మే 20: అకాల వర్షాలు అన్నదాతను ఆగం చేస్తున్నాయి. వారం రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు గాసినా తేమశాతం పేరుతో వడ్లు కొనుగోలు చేయడం లేదు. వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రాయపోల్ మండలంలోని కొత్తపల్లిలోని ఐకేపీ కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో వడ్లపై కప్పిన టార్పాలిన్ కవర్లపై నీటిని ఎత్తిపోయడం, మళ్లీ కప్పడం రైతులకు తప్పడం లేదు. ధాన్యం త్వరగా కొంటామని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు కొనుగోలులో ఆలస్యం, మరోవైపు వర్షాలతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

# రైతుల కష్టం నీళ్లపాలు

- రోడ్లు, కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల అగచాట్లు
- అకాల వర్షాలకు తడిసి ముద్దవుతూ మొలకెత్తుతున్న ధాన్యం
- వడ్లు కొనుగోలు చేసి ఆదుకోవాలంటూ వేడుకోలు



అందోల్: కొనుగోలు కేంద్రంలో వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతున్న ధాన్యం

అందోల్, మే 20: ఆరుగాలం కష్టపడి పండించిన పంట కల్లాల్లోనే తడిసి మొలకెత్తుతుంది. యాసంగిలో పండించిన ధాన్యం పూర్తిగా కొనకపోవడంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎక్కడ చూసినా రోడ్లు, కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. దీనికితోడు ప్రకృతి సైతం పగ పట్టినట్లు వర్షాలు కురుస్తుండడంతో వడ్లు తడుస్తూ ధాన్యం మొలకెత్తుతుంది. అందోల్, చౌటకూర్, పుల్కల్ మండలాల్లో రైతులు వరి సాగుచేశారు. అందుకనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, సరైన సమయానికి ధాన్యం కొనకపోవడం.. కొన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతుండడంతో రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో ధాన్యం తడుస్తూ మొలకలు వస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

### రోడ్లపైనే మొలకెత్తుతున్న ధాన్యం



వడ్లను రోడ్లపై ఆరబెట్టుకుని రోజులు గడుస్తున్నా కొనడం లేదు. దీంతో వానకు తడిసి వడ్లు మొలకలు వస్తున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వడ్ల దగ్గరే పడుకోవాల్సి వస్తుంది. కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్తే సీరియల్ ప్రకారం కొంటాం? నీ నంబర్ వచ్చినప్పుడు రా.. అంటూ సమాధానం చెబుతున్నారు. ఏ ఒక్క అధికారీ మా బాధలు పట్టించుకోవడం లేదు. పంటలు పండించేందుకు కష్టాలే.. అమ్మేందుకు కష్టాలే... ప్రభుత్వం ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి పెట్టి ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలి.

– గోపాల్, రైతు, ముద్దాయిపేట్

### రైతులను కష్టపెట్టడం సరి కాదు



ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనకుండా జాప్యం చేస్తూ రైతులను కష్టపెట్టడం కరెక్ట్ కాదు. ధాన్యం అమ్మేందుకు గతంలో ఎన్నడూ ఇంతలా ఇబ్బంది పడలేదు. ఇప్పుడూ మాత్రం చాలా కష్టాలు పడుతున్నాం. రోడ్లపై, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి మొలకెత్తుతుంది. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. రానున్న రోజుల్లో ఇంకా భారీ వర్షాలు ఉన్నాయని అధికారులే అంటున్నారు. వర్షాలు పడక ముందే ధాన్యం కొనేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే మేము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

– వెంకటేశం, రైతు, పుల్కల్